AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**అక్షరటుడే, కామారెడ్డి :** పర్యావరణ హితమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని సీఐ శ్రీధర్ గౌడ్ అన్నారు. గర్గుల్ గ్రామపంచాయతీలో ఆదివారం సాయంత్రం సర్పంచ్ చింతల దివ్య రవితేజ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎస్సై రంజిత్‌తో కలిసి శ్రీ వెంకటేశ్వర క్లినిక్ డాక్టర్ శ్రీనివాస్ అందించిన 108 మట్టి వినాయక విగ్రహాలను యువజన సంఘాల అధ్యక్షులకు అందజేశారు. కుమార్ గౌడ్, శంకర్ గౌడ్, నర్సింలు, యాదగౌడ్, స్వామి, నరేష్ రెడ్డి ఉన్నారు.



## ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని బొల్లారం సెక్షన్ ఆఫీసర్ విక్కీ మార్టిన్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు అటవీ శాఖ ఆదేశాలు జారీ చేసింది. బొల్లారం అటవీ సెక్షన్ పరిధిలోని ఎక్కపల్లి తండా, ఎక్కపల్లి, పర్కల్ల, శెట్పల్లి అటవీ బీట్ల పరిధిలో అడవుల నరికివేత, అటవీ భూముల ఆక్రమణలను నిరోధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆయనను సస్పెండ్ చేశారు. ఈనెల 1న కామారెడ్డి జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) నీరజ్ కుమార్ త్రిపాఠి బొల్లారం సెక్షన్ పరిధిలోని ఎక్కపల్లి తండా అటవీ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. ఎకరాల విస్తీర్ణంలో చెట్లను నరికివేసి అటవీ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. అటవీ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం చెందిన డీఎఫ్‌వో, శెట్‌పల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్యాంసుందర్‌ను అక్కడికక్కడే సస్పెండ్ చేశారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ విక్కీ మార్టిన్‌పై చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్)కు సిఫారసు చేశారు. డీఎఫ్‌వో సిఫార్సు మేరకు బొల్లారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ విక్కీ మార్టిన్‌ను సస్పెండ్ చేస్తూ పీసీసీఎఫ్ ఉత్తర్వులు జారీ చేశారు.



## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని నగర మేయర్ ఉమారాణి పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణతో కలిసి మట్టిగణపతులను ఉచితంగా అందజేశారు. నగరంలోని 37వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి టెంట్ హౌస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పర్యావరణాన్ని కాపాడేందుకు మనవంతుగా కృషి చేయాలని, ప్రజలందరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠిం చి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎర్రం గంగాధర్, ప్రవీణ్, కో ఆప్షన్ సభ్యులు బొబ్బిలి మురళి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య మహాసభ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తరలిన నాయకులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** హైదరాబాద్‌లో జరిగిన ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణ భూమి పూజకు ఆదివారం ఎల్లారెడ్డి వైశ్య ప్రముఖులు తరలి వెళ్లారు. ఉప్పల్ భగయత్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య మహాసభ ఆత్మగౌరభవన నిర్మాణానికి ఐదు ఎకరాలు కేటాయించిందని ఎల్లారెడ్డి ఆర్యవైశ్యులు పేర్కొన్నారు. ఆ స్థలంలో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నిజామాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్‌ను ఆర్యవైశ్య సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి వెళ్లిన వారిలో రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, ఎల్లారెడ్డి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ధి శ్రీధర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఓర విఠల్ గుప్తా, కోశాధికారి గోరంటి సాయినాథ్ గుప్తా తదితరులు ఉన్నారు.



వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా సిద్ధం అయింది. రేపు గణేశ్ చతుర్థి నేపథ్యంలో.. గణనాథులను ప్రతిష్ఠించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే భారీ వినాయక విగ్రహాలను మండపాలకు తరలించారు. అనంతరం వాటిని ముస్తాబు చేయనున్నారు. ఈ క్రమంలో గణేశ్ ఆగమన్ పేరిట పెద్ద ఎత్తున ర్యాలీలు, శోభాయాత్రలు చేస్తున్నారు. బ్యాండ్, డీజేలతో గణనాథుడిని ఊరేగింపుగా మండపాలకు తీసుకు వెళ్తున్నారు.

- అక్షరటుడే, ఎల్లారెడ్డి /కామారెడ్డి

# అట్టహాసంగా గణేశ్ ఆగమన్

- మండపాలకు తరలుతున్న గణనాథులు
- ముస్తాబు అవుతున్న మండపాలు
- నిబంధనలు పాటించాలని పోలీసుల సూచన

ఉమ్మడి జిల్లాల్లో ప్రతి యేటా వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. నిమజ్జనం వేళ వైభంగా శోభాయాత్ర చేస్తారు. గతంలో స్వామివారిని ప్రతిష్ఠించే సమయంలో ఎలాంటి హంగామా ఉండేది కాదు. వాహనంలో తీసుకొచ్చి.. మండపంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేసేవారు. అయితే ఇటీవల ఆగమన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. నిమజ్జనం సమయంలో చేసినట్లు వినాయకుడిని తీసుకొచ్చే సమయంలో సైతం శోభాయాత్ర చేస్తున్నారు. ఇప్పటికే పలు వినాయక విగ్రహాలను తీసుకురాగా.. మిగతా వాటిని రేపు మండపాలకు తేనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ముస్తాబవుతున్న భారీ సెట్టింగ్స్

కామారెడ్డి ప్రధాన మార్కెట్లో వినాయక చవితి పండగ సందడి నెలకొంది. విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయకులతో మార్కెట్ కళకళలాడుతోంది. పట్టణంలో వినాయక మండపాల ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. భారీ సెట్టింగులతో మండపాలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ప్రధాన కూడళ్లలో బంగారు వర్ణంలో ఆలయాన్ని తలపించేలా, కళాత్మక చెక్కడాలు, భారీ స్తంభాలతో ఆకట్టుకునేలా మండపాలను తీర్చిదిద్దుతున్నారు.




### నిర్లక్ష్యం వద్దు

గతంలో గణపతి ప్రతిమలను సంప్రదాయ పద్ధతుల్లో మండపాలకు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఆగమనం పేరుతో భారీ ఏర్పాట్లు, అధిక శబ్దాలతో పోటీ వాతావరణం నెలకొంటోంది. ట్రాలీలు, లారీలపై భారీ సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయడం, వాహనాలపై ప్రమాదకరంగా నిలబడటం, బాణసంచా కాల్చడం, వంటి చర్యలు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. యువత జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల సమయంలో సైతం మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని చెబుతున్నారు.

### పోలీసులకు సహకరించాలి

వినాయకుడి ఆగమనం ఆనందానికి ప్రతీక కావాలి. ఏ కుటుంబానికీ విషాదాన్ని మిగల్చకూడదు. భక్తి పేరుతో నిబంధనలు ఉల్లంఘించకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి. ప్రమాదకర స్టంట్లు, అధిక శబ్దం, అనుమతి లేని డీజేలపై చర్యలు తప్పవు. – రాజేష్ చంద్ర, కామారెడ్డి ఎస్పీ

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం: సీపీ సాయిచైతన్య



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యలకు సంబంధించి 6,649 కేసులు పరిష్కారమయ్యాయని సీపీ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాకు చెందిన సైబర్ క్రైం, వివిధ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించామన్నారు. కేసుల పరిష్కారంలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో అగ్రగామిగా ఉంచడంలో కృషి చేసిన అధికారులు, సైబర్ క్రైం, కోర్టు సిబ్బందిని జిల్లా పోలీస్ కమిషనర్ అభినందించారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్ అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అన్నారు. అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చన్నారు. ముఖ్యంగా సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని , తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ ఆధ్వర్యంలో ఏడు కమిషనరేట్ ల పరిధిలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు, ప్రతి జిల్లాలో డీ-4సీని ఏర్పాటు చేసి చేశారన్నారు. జిల్లాలో నమోదైన సైబర్ నేరాల్లో ఈ జాతీయ మెగా లోక్‌అదాలత్ ద్వారా 71 సైబర్ క్రైం కేసుల్లో రూ.24,02,552 తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు ఆర్డర్ కాపీలను

## దళితులను అణచివేయడమే బీజేపీ-బీఆర్‌ఎస్‌ల ఎజెండా



**అక్షరటుడే, కామారెడ్డి:** బీఆర్ఎస్ పార్టీలు రెండూ దళిత వ్యతిరేక పార్టీలని, పేర్లు వేరైనా ఎజెండా ఒక్కటేనని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ విమర్శించారు. కామారెడ్డి కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ప్రదేశాన్ని బీజేపీ-ఆర్ఎస్ఎస్ వర్గాలు శుద్ధి చేయడం, తెలంగాణ అసెంబ్లీలో దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను బీఆర్ఎస్ నేతలు అన్ పార్లమెంటరీ భాషతో అవమానించడం వారి మనువాద భావజాలానికి నిదర్శనమన్నారు. గతంలో దళిత సంఘాలు కేసీఆర్‌ను కలిసినప్పుడు ఆ ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేశారనే ఆరోపణలు కూడా ఇందులో భాగమేనన్నారు. దళితుడిని సీఎం చేస్తానన్న హామీ, మూడు ఎకరాల భూమి హామీ, దళితబంధులో సమాన న్యాయం ఏమయ్యాయని ప్రశ్నించారు. మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించి ఆయన హోదాను దెబ్బతీశారని, ప్రస్తుతం దళిత స్పీకర్ ను అధ్యక్షా అని పిలవాల్సి వస్తుందనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదనే చర్చ ప్రజల్లో ఉందన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్, పండ్ల రాజు, భూమని బాలరాజ్, రాజా గౌడ్, గుడుగుల శ్రీనివాస్, పాత రాజు, కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులో పర్యాటకుల సందడి



**అక్షరటుడే, పోచంపాడ్:** వరుసగా మూడు రోజుల సెలవులు రావడంతో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు పర్యాటకులతో సందడిగా మారింది. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు ప్రాజెక్టును సందర్శించేందుకు తరలివచ్చారు. ప్రాజెక్టు పరిసరాల్లో వీచే చల్లటి గాలులను ఆస్వాదిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదంగా గడిపారు. ముఖ్యంగా చిన్నారులు గుర్రపు సవారీ చేస్తూ ఎంతో ఉత్సాహంగా ఆనందించారు. పర్యాటకుల రాకతో ప్రాజెక్టు పరిసరాల్లో చిన్న చిన్న స్టాల్స్ ఏర్పాటు చేసుకున్న వ్యాపారులకు కూడా వ్యాపారం పుంజుకుంది.

## యూరియా భారమై వ్యవసాయం ఘోరమైంది : మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఎరువుల కొరత, నకిలీ విత్తనాల బెడద, ఎడాపెడా విద్యుత్ కోతల నుంచి తమను కాపాడాలని తెలంగాణ రైతులు వినాయకుడిని వేడుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పేర్కొన్నార. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూకబ్జాలలో బిజీ బిజీగా ఉందన్నారు. అన్నదాతల మొర ఆలకించే పరిస్థితి లేదని ఆయన ఎద్దేవా చేశారు. దీంతో రైతులు తమ బతుకుభారాన్ని దేవుడిపై వేస్తున్నారని పేర్కొన్నారు. ఎరువుల పేరుతో ఉత్తుత్తి యాప్‌లు, కాంగ్రెస్ సర్కార్ ఫ్లాపుల మీద ఫ్లాపులకు అద్దం పడుతున్నాయని జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. యూరియా భారమై, వ్యవసాయం ఘోరమై అన్నదాతలు దిక్కు తోచని స్థితికి చేరినా కాంగ్రెస్ సోమరి నాయకులు నిద్రలేవకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత సమస్యలు మొదలై రైతులు నానా తిప్పలు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే రైతుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

## నగరంలో భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన జెండా జాతర






**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** నగరంలో జెండా బాలాజీ ఉత్సవాలు ఆదివారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఆస్థాన అర్చకులు జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘన చరిత్ర ఉన్న జెండాకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన అనంతరం భక్తులు.. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య జెండాను, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మేళతాళాల మధ్య జెండా గల్లీలోని జెండా బాలాజీ మందిరంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. 15రోజుల పాటు ఆలయంలో జెండా జాతర జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఉదయం 6 గంటల నుంచి ఆలయం తెరిచి ఉంటుందన్నారు. ఆలయ అర్చకులు నాగరాజు, ఈవో ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిచారు. జాతర ప్రారంభంమైన సందర్భంగా ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

అది నిత్యం జిల్లా ఉన్నతాధికారులు ప్రయాణించే రహదారి.. కలెక్టర్, ఎస్పీలు తిరిగే ఈ రహదారిపై రాత్రయితే చాలు చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. దీంతో సాధారణ ప్రజలు ఈ దారి గుండా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉన్నతాధికారులు నిత్యం సంచరించే రహదారే ఇలా ఉంటే సాధారణ రోడ్లపై పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి

# చిమ్మ చీకట్లో రహదారులు..

- కలెక్టరేట్, ఎస్పీ ఆఫీసులకు వెళ్లేదారిలో లేని వీధిదీపాలు
- విద్యుత్ స్తంభాలే లేని వైనం..
- భయం గుప్పిట్లో ప్రజలు



జిల్లా పరిపాలనకు కేంద్రమైన కలెక్టరేట్, జిల్లా పోలీసు ఉన్నతాధికారి కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారే చీకట్లో మగ్గుతోంది. కనీసం వీధి దీపాలు లేకపోగా, దీపాలు బిగించేందుకు విద్యుత్ స్తంభాలు కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. రైల్వే గేటు నుండి అడ్లూర్ బైపాస్ బ్రిడ్జి మీదుగా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు వెళ్లే ఈ ప్రధాన రహదారిలో ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అడ్లూర్, గుమస్తా కాలనీ, జయశంకర్ కాలనీ వాసులు ఈ దారి గుండానే నిత్యం నడుచుకుంటూ వెళ్తుంటారు.

### భయం..భయంగా


పగటిపూట రద్దీగా ఉండే ఈ రహదారి, రాత్రి కాగానే చిమ్మచీకటిగా మారుతోంది. వచ్చేపోయే వాహనాల లైట్ల వెలుతురు తప్ప మరో వెలుతురు కనిపించని పరిస్థితి. ఈ అంధకారాన్ని ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న రాజీవ్ గృహకల్పలో ఒకే రాత్రి మూడు ఇళ్లలో చోరీ జరగడం కలకలం రేపింది. రాత్రిపూట మహిళలు, ఉద్యోగులు ఈ దారిలో వెళ్లాలంటే భయభయంగా వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు వెళ్లే దారి పరిస్థితే ఇలా ఉంటే, సాధారణ కాలనీల పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తక్షణమే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలు బిగించి ప్రజలకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

## అంబేద్కర్, రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన



**అక్షరటుడే, బాన్సువాడ:** అంబేద్కర్, భారత రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో దళిత, బహుజన సంఘాల నాయకులు ఆదివారం నిరసన చేపట్టారు. హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ద్వారా లభిస్తున్న హక్కులు, ఫలాలను పొందుతూనే రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలోని కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కమ్మరి నర్సింలు, గ్రామ సర్పంచ్ మన్నే రమేష్, కె. శ్రీనివాస్ రెడ్డి, ఎన్. నర్సింలు, గొబ్బూరు జనార్దన్ రెడ్డి, మన్నే చిన్న సాయిలు, మంద శ్రీనివాస్, మమ్మాయి లక్ష్మణ్, బొప్పని శీను తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ



**అక్షరటుడే, భిక్కనూరు :** మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో గాంధీ చౌక్ వద్ద ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ 13వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చత్రపతి శివాజీ ఫౌండేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పెరుమాళ్ల గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చన్నారు. పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోడూరి సాయాగౌడ్, ఉపసర్పంచ్ చైతన్య కొండల్‌రెడ్డి, తిరుపతి గౌడ్, కుమ్మరి అశోక్, మెజిషియన్ సంతోష్, సురేష్ రెడ్డి, నవీన్, నాగరాజ్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలూర్ సర్పంచ్ ముక్కెర విజయ్ కోరారు. ఆదివారం ఆలూర్ మండల కేంద్రంలో సర్పంచ్ ముక్కెర విజయ్ ఆధ్వర్యంలో ప్రజలకు వెయ్యి స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ప్లేట్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా స్టీల్ ప్లేట్లను వినియోగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో పరిశుభ్రతను పెంపొందించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించేందుకు ప్రజలు తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. స్టీల్ ప్లేట్లను నిత్యావసర కార్యక్రమాల్లో వినియోగించడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. వార్డ్ మెంబెర్ సాయిలు, సంతోష్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## హమారా ప్రసాద్‌ను అరెస్ట్‌చేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన, అంబేద్కర్ కల్పిత నాయకుడు అన్ని పుస్తకం రాస్తున్న హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని అంబేద్కర్ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. కామారెడ్డిలో నిరాహార దీక్ష చేస్తున్నటువంటి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకన్నకు ఎల్లారెడ్డి అంబేద్కర్ సంఘ సభ్యులు అట్కారి బబ్లు (అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు) సంఘీభావం తెలిపారు. రాజ్యాంగం రాసిన అంబేద్కర్‌కు వ్యతిరేకంగా బుక్ రాయడం సరికాదన్నారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఎల్లారెడ్డి అంబేద్కర్ సంఘ సభ్యులు నీరుడి నాగరాజు, పెద్దబల్ రాజు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సభ్యులు మెగావత్ కాన్షీరాం, వెంకటయ్య, ఆంజనేయులు, సాయిలు, శివరాములు, తుపాకుల శంకర్ పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని బైపాస్ రోడ్డులోని కొత్తపల్లిముప్కాల్ బ్రిడ్జి రోడ్డు మధ్యలో.. ఆర్మూర్‌కు వైపు వెళ్లే మార్గంలో డ్రైనేజీలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## శివాజీ మహారాజ్ ఆశయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమాజానికి ఆదర్శంగా నిలవాలని శ్రీ శివాజీ మహారాజ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ శివాజీ పాటిల్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని గీతాభవన్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. లక్ష్మణ్ పాటిల్ మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ ఆలోచనలను, ఆదర్శాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని, ఎక్కడైతే శివాజీ మహారాజ్ విగ్రహాలను ఏర్పాటు చేశారో, ఆ కమిటీ అక్కడ పర్యవేక్షణ చేయాలని సూచించారు. రవికుమార్, దుర్గ ప్రసాద్, రాజేశ్వర్, అంబదాస్, దిగంబర్ పాంద్రి, కృష్ణ పాటిల్, సుభాష్, సిరికొండ వెంకట్ రెడ్డి, రాకేష్, సుధాకర్ పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



**అక్షరటుడే, ఇందూరు:** మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ధన్‌పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రణయ్ కుమార్ తెలిపారు. నగరంలోని జవహర్ రోడ్డులో కిసాన్ షాపింగ్ మాల్ వద్ద ఉచితంగా మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. హిందూ సంప్రదాయంలో వినాయకుడికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. విఘ్నాలను తొలగించే భగవంతుడు వినాయకుడు అని తెలిపారు. తమ ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం మట్టి వినాయకులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే నగరంలోని అన్ని మండపాలకు చెందా రూపంలో సహకారం చేశామని చెప్పారు. పురాణాల ప్రకారం మట్టి వినాయకులను పూజించాలన్నారు. కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, నాయకులు మరవార్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మెండోరాలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం



**అక్షరటుడే, బాల్కొండ:** మెండోరా మండలంలోని గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల నియామకాలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆమోదం తెలిపింది. డీసీసీ అధ్యక్షుడు నరేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బడాల సాయిరెడ్డి సూచనల మేరకు నియామకాలు చేపట్టారు. మండలంలోని బుస్సాపూర్‌కు జక్కుల రాజన్న, ఎస్సారెస్పీకి కిరణ్, సోన్‌పేట్‌కు మల్కేష్, దూద్‌గావ్‌కు బోలిశెట్టి సాగర్, చాకిర్యాల్‌కు దేవేందర్, మెండోరాకు నోముల రాజన్న, కోడిచెర్లకు కొమ్ముల దేవేందర్, వెల్గటూర్‌కు అంజయ్య, సావెల్‌కు లక్ష్మణ్, నెహ్రూనగర్‌కు ధన్‌రాజ్, నడిమితండాకు వినోద్‌ను గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించినట్లు లేఖలో పేర్కొన్నారు. మెండోరా మండలంలో కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా కొనసాగుతున్న మైనార్టీ విభాగాల తాత్కాలిక కమిటీలను రద్దు చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బడాల సాయిరెడ్డి ప్రకటించారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు త్వరలోనే నూతన మైనార్టీ విభాగాల కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా పోచంపాడ్ అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు.


## సోమవారం శ్రీ నారాయణ స్కూల్‌లో మట్టి విగ్రహాల పంపిణీ

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని శ్రీ నారాయణ హైస్కూల్‌లో ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పీవోపీ గణపతి విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్కూల్ ప్రతినిధులు పేర్కొన్నారు. పీవోపీ గణపతి వద్దు.. మట్టి గణపతి ముద్దు అనే నినాదంతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా నేడు ఉదయం 7:30 గంటల నుంచి మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా అందజేయనున్నారు. మట్టి గణపతి విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని శ్రీ నారాయణ హైస్కూల్ నిర్వాహకులు కోరారు.

## డీజేలకు అనుమతి లేదు



**అక్షరటుడే, కోటగిరి :** డీజేకు అనుమతి లేదని.. నిబంధనలు అతిక్రమిస్తే రూ.5లక్షల వరకు జరిమానా, కేసు నమోదు చేస్తామని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో.. ఆదివారం, గణేష్ మండపాల నిర్వాహకులు, గ్రామపెద్దలు, మైనారిటీలు, యువకులతో.. శాంతియుత సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. రెండు బాక్సులకు పర్మిషన్ ఉందన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, మండపాల నిర్వాహకులదే పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. మండపాల దగ్గర, రాత్రి,పగళ్లు, కుక్కలు, కోతులతో ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే, ఇద్దరు యువకులను కాపలా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్లూరి సంధ్య, హన్మాండ్లు (బజరంగ్) ఉప సర్పంచ్, నాభి, గంగాధర్ పటేల్, వాహిద్, జుమ్మా ఖాన్, బజరంగ్ దత్తు, గంగా రాజ్ ,ముస్తాక్, భూమయ్య పాల్గొన్నారు.



## వంతెన పైనుంచి వాగులో పడ్డ జేసీబీ.. డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం

**అక్షరటుడే, లింగంపేట:** అదుపు తప్పిన ఓ జేసీబీ వాగులో పడిపోయింది. ఈ ఘటన లింగంపేట మండలంలోని లింగంపేట కుర్దు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలం లింగంపల్లి కుర్దు వద్ద పాముల వాగు వంతెన నిర్మాణానికి శనివారం పనులు ప్రారంభించారు. పనులు చేపడుతున్న తరుణంలో ఆదివారం ప్రమాదవశత్తు జేసీబీ వంతెన పైనుంచి వాగులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జేసీబీ డ్రైవర్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వర్షాకాలం ప్రారంభంలో వర్షాలకు ఈ వంతెన వద్ద రాకపోకలు స్తంభించాయి. దీంతో అధికారులు తాజాగా పనులు ప్రారంభించారు.

## సబ్ స్టేషన్‌కు సోలార్ విద్యుత్ అనుసంధానం

**అక్షరటుడే, కామారెడ్డి:** సదాశివనగర్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు 2 మెగా వాట్ల సామర్థ్యం ఉన్న సోలార్ పవర్ ప్లాంట్‌ను అనుసంధానం చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సాలియా నాయక్ తెలిపారు. శనివారం సాయంత్రం సోలార్ పవర్ ప్లాంట్ యజమాని మండా అక్షయ్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ఎస్ఈ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయిలో ఉన్న నేపథ్యంలో ఈ 2 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందుబాటులోకి రావడం ద్వారా స్థానిక విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ విజయ సారథి, డీఈ ఆపరేషన్ కామారెడ్డి నందకుమార్, డీఈ ఎంఆర్టీ కళ్యాణ్ చక్రవర్తి, ఏడీలు, ఏఈలు, పాల్గొన్నారు.



## వేంకటేశ్వర ఆలయంలో స్వచ్ఛ భారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని తిరుమల కాలనీలోని వెంకటేశ్వర ఆలయం ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఆలయంలోని రావి చెట్టు వద్ద పేరుకుపోయిన చెత్తనంతా తొలగించి సుందరంగా తీర్చిదిద్దారు. స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతి వారం ఇటువంటి స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, ఈవారం కాలనీలోని వెంకటేశ్వర ఆలయంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా 71వ ఆదివారం తిరుమల కాలనీలోని వెంకటేశ్వర ఆలయంలో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు పెద్ద గంగారాం, సాయి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు బొగడమీది ప్రశాంత్, వేద రాజ్ కుమార్, జంగిడి భోజన్న, రాహుల్‌రాజ్, గుర్రం రాకేష్, కుకింగ్ నరేష్, డ్రైవింగ్ స్కూల్ వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.